REGD. NO. A. 18

విడి ప్రతి 0-20 న. పై

శుక్రవారం 15-12-61

# జమీన్ రైతు

సంస్థాపకులు : నెల్లూరు వెంకట్రామానాయుడు

సంపుటి 33 ★ సంపాదకుడు : నెల్లూరు శ్రీరామమూర్తి ★ సంచిక 50

## తిరుపతిలో నేత్రదాత శ్రీ మోదీ

### 1040 ఆపరేషన్లు : 10 వేల రోగుల పరీక్ష

తిరుపతిలో 7 తేది ప్రారంభమైన క్యాంపులో నేత్రదాత పద్మశ్రీ డాక్టరు మోదీ 10,000 మంది కంటిరోగులను పరీక్షించారు; 1040 మందికి ఆపరేషన్లు జేశారు.

తిరుపతిలో ఈ విధంగా మోదీ క్యాంపు జరగడం యిది ఆరవసారి. దేశంలోని నలుమూలలనుండి రోగులు విచ్చేశారు. దేవస్థానంవారు రోగులకు భోజన, నివాసవసతులను కల్పించారు. ఈసారి తిరుపతిలోని క్షేత్రసత్రమే చాలలేదట. ఎంతోమంది పెద్దలు క్యాంపును దర్శించి, డాక్టరు మోదీ అనుపమాన మానవసేవను కొనియాడారు.

# ముఖ్యమంత్రిత్వం చేపట్టాలని శ్రీ సంజీవరెడ్డి?

## దీనిని నిరోధించుటకు అల్లూరి, సంజీవయ్య 'జాయింట్ ఫ్రంట్'

★

### రఘురామయ్యద్వారా కృష్ణమీనన్ సందర్శనం: సంజీవరెడ్డికి రెండువంతుల అభ్యర్థుల సుముఖత?

:o:

## శ్రీ పల్లంరాజు తాటస్థ్యం ?

(మా హైదరాబాదు విలేఖరి)

ఆంధ్ర కాంగ్రెస్ రాజకీయాలు మళ్ళీ వెలుపలికిరావడంతో, ఢిల్లీలో రాజకీయరభస ముక్తాయింపు స్థాయికి అందుకోబోతున్నది.

శ్రీ సంజీవరెడ్డిగారు తిరిగి రాష్ట్ర రాజకీయాలలో ప్రవేశించదలచినట్లు గతపర్యాయం ఢిల్లీకివచ్చినప్పుడే అల్లూరి, పళ్ళంరాజులతో సహా అందరికీ ప్రకటించేశారు.

ఎన్నికలన్నీ పూర్తిఅయినపిమ్మట, అవసరమైతే కాంగ్రెస్ అధ్యక్షపదవినైనా వదులుకోవడానికికూడా తాను సిద్ధమేనంటూ శ్రీ సంజీవరెడ్డిగారు తిరిగి ముఖ్యమంత్రిత్వం చేపట్టాలనే ఆకాంక్షను ఢిల్లీలో బాహాటంగానే ప్రకటించారు. ఈ ప్రకటన ఆదిలో శ్రీ బ్రహ్మానందరెడ్డినికూడా కొంతగా ఆందోళనపరచి "రాజరాజనరేంద్రుడు కాదల చాడా ఈ సంజీవరెడ్డి" అనేఅభిప్రాయాన్నికూడా ఆంతరంగికులతో వెలిబుచ్చారనీ, అంతట ఈవిధంగా అలజడి పొడగట్టగా దని శ్రీ తిమ్మారెడ్డి, ఏ. సి. గారలికపురూ ఆయన కోపాన్ని చల్లార్చడానికి ప్రయత్నించి ఆ ప్రయత్నంలో సఫలులయ్యారనికూడా తెలియవచ్చింది.

—కొరవ 12-వ పేజీలో

# నెల్లూరు, కావలికాలేజీలసమ్మె

## అధికార్లకు తెలుపకుండా, ఆలోచనకు అవకాశమివ్వకుండా విద్యార్థుల తొందరపాటు

తమ సమస్యల పరిష్కారానికి నెల్లూరు వి.ఆర్. కాలేజి విద్యార్థులు ఆరునెలల పరీక్షలకు హాజరుగాకుండ 12 తేది నుండి సమ్మె చేస్తున్నారు. ఈ సమ్మె ప్రారంభమై నేటికి నాలుగు రోజులు.

3 గంటల పరీక్షలు రోజుకు ఒకటి చొప్పున జరపాలనేది వీరి కోర్కెలలో ప్రధానమైనది. ఈ విషయంలో వీరి ప్రతినిధులు వైస్ ఛాన్సలర్ వద్దకు రాయబారం పోయివున్నారు. కాని వారు తిరిగిరాకమునుపే, రాయబారపు కార్యపరిణామం తెలియకమునుపే, కనీసం కాలేజి ప్రిన్సిపాల్ కు ముందు తెలియజేయకుండానే వీరు ఆనాలోచితంగా ఆకస్మికంగా ఈ సమ్మెను ప్రారంభించారు. సమ్మె చేస్తున్న కరువు విద్యార్థులనుండి వీరికి టెలిగ్రామ్ రావడంతోనే ముందు వెనుకలు ఆలోచించకుండా వీరు సమ్మెలో దిగారు. రాయబారం పంపి, యీలోగానే తాము సమ్మె చేయడం అనుచితమని సమ్మెను నడుపుతున్న విద్యార్థులే అంగీకరిస్తున్నారు. కావలి కళాశాల విద్యార్థులు కూడ 14 వ తేదినుండి సమ్మె చేస్తున్నారని తెలుస్తున్నది.

వి. ఆర్. కాలేజి విద్యార్థులకు ఆరునెలల పరీక్షలు జరుగుతున్నవి. ఈ పరీక్షలకు విద్యార్థులు ఒక్కరోజుమాత్రం హాజరైనారు. రెండవ రోజునుండి సమ్మె చేస్తున్నారు. పరీక్షలకు హాజరు కాకుండడం కాబట్టి, తక్కువ ప్రయత్నంతో, సమ్మె విజయవంతంగా జరుగుతున్నట్లున్నది.

సమ్మె చేస్తున్న విద్యార్థుల కోర్కెలివి:-

1. 3 గంటల పరీక్షలు రోజుకొక్కటే నిర్వహించాలి.

2. గ్రూపు సబ్జక్టులలో విడివిడిగా ఉత్తీర్ణులు కావడానికి అవకాశం కల్పించాలి.

—కొరవ 7-వ పేజీలో

## కనిగిరి రిజర్వాయరు జూనియర్ ఇంజనీర్ విషాద మరణం

*

### సిద్దీపురంవద్ద కారుతోగూడా కాల్వలో పడిన దుర్ఘటన : శవం ఈరోజుతేలిన వైనం

నెల్లూరు తెలుగోపాలస్వామి ఆలయ మేనేజింగ్ట్రస్టీ, నిర్మొగమాటి, పెద్దమనిషి అయిన కాపువీధి వాస్తవ్యులు శ్రీ ఆనం వెంకటరెడ్డి (శ్రీ ఏ. సి. తమ్ముడుకాదు) గారి కుమారుడు, పి. డబ్ల్యు. డి. శాఖ సంగం సబ్ డివిజను లో జూనియర్ ఇంజనీరుగా పని చేస్తున్న శ్రీ వెంకటసుబ్బారెడ్డి (27 సం॥) సిద్దపురం యానాదికాలనీ మలుపులో వున్న కనిగిరి రిజర్వాయర్ కు సంగం ఆనకట్టనుండి నీటిని సరఫరాచేసే మెయిన్ సప్లయిఛానల్ తూమువద్ద, కాల్వగట్టున ఒంటరిగా కారును వెనుకకు తోలుతుండగా, ప్రమాదవశాత్తు కారు కాల్వలోని మడుగులో చిక్కుకొని నిన్న (14 తేది) ఉదయం దుర్మరణం చెందారు. ఆ తూము వద్ద కాల్వ లోతు 20 అడుగులు వరకువుంటుందట. ఈవిషయం తెలిసి వెంకటసుబ్బారెడ్డి బంధువులు, పి. డబ్ల్యు. డి. అధికారులు వెళ్ళి శ్రీ వెంకటసుబ్బారెడ్డి శవాన్ని వెలికి తీయుటకు తీవ్ర ప్రయత్నాలు చేశారు. కారుమాత్రం బయటకు తీయబడిందిగాని శవం జాడ 14 వ తేది సాయంత్రంవరకు కనుపించలేదు. ఈ రోజు (15 తేది) ఉదయం ప్రమాదస్థలంలోనే వెంకటసుబ్బారెడ్డి శవం తేలి నెల్లూరుకు తీసుకురాబడి అంత్యక్రియలు జరిగినవి.

14 వ తేది ఉదయం 8 గంటలప్పుడు వెంకటసుబ్బారెడ్డి, సబ్ డివిజనల్ ఆఫీసరు యిరువురూ సంగం వెళ్లి, అక్కడ సబ్ డివిజనల్ ఆఫీసరును దిగబెట్టి, బుచ్చిరెడ్డిపాళెము నకు తానొక్కడే కారులో తిరిగి వస్తూ, సిద్దిపురం యానాది కాలనీ రోడ్డు మలుపులో వున్న కనిగిరి రిజర్వాయర్ మెయిన్ సప్లయి

—కొరవ 12-వ పేజీలో

## బేటరీలైట్ ఉచితం

### నిర్మల గిఫ్ట్ కూపన్లు పొందండి

నిర్మల స్పెషల్ కాఫీపొడి ప్యాకెట్లు మూడు సైజులలో గిఫ్ట్ కూపన్లు వేయబడును, కనుక వాడుకదార్లు ఈ క్రిందివిధముగా కూపన్లు ఇచ్చిన వారికి ఒక యిండియన్ పైలట్ పేనాగాని లేక యిండియన్ యెవరెడి బ్యాటరీలైటు (2 సెల్సులతో వున్నవి) గాని ఉచితముగా ఇవ్వబడును.

| | | | |
|---|---|---|---|
| 400 | గ్రాముల | కూపన్లు | 25 |
| 200 | ,, | ,, | 50 |
| 100 | ,, | ,, | 100 |

గ్రాము : నిర్మల ఫోన్ : 280

## నిర్మల కాఫీ వర్క్సు

ట్రంకురోడ్డు — నెల్లూరు

